ప్రజలంతా జగన్ పక్షమే..

- ప్రతిపక్షాలు మూకుమ్మడిగా వచ్చినా వైఎస్సార్‌సీపీదే విజయం
- ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన నాయకుడు సీఎం జగన్
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- 68వ వార్డులో రూ.2.64 కోట్ల పనులకు శంకుస్థాపన
- అక్కిరెడ్డిపాలెంలో శ్మశానవాటిక ప్రారంభం



అక్కిరెడ్డిపాలెంలోని శ్మశానవాటికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, సమన్వయకర్త ఉరుకూటి చందు

అక్కిరెడ్డిపాలెం: ప్రతిపక్షాలు మూకుమ్మడిగా వచ్చినా ప్రజలు జగన్‌మోహన్ రెడ్డి పక్షాన ఉన్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడంతో పాటు ఇవ్వని వాటినీ అమలు చేసిన ఘనత ఆయనకే చెందుతుందన్నారు. జీవీఎంసీ 68వ వార్డులో రూ.2 కోట్ల 64 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు కార్పొరేటర్ గుడివాడ అనూషతో కలిసి శంకుస్థాపన శిలా ఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం అక్కిరెడ్డిపాలెం, మిందిలో శ్మశాన వాటికలతో పాటు అక్కిరెడ్డిపాలెం, రాంనగర్‌లలో ధోబీ ఖానాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమాలకు ప్రాధాన్యం ఇస్తున్న జగనన్న వెంటే ప్రజలు ఉంటారన్నారు. గత టీడీపీ పాలనలో శంకుస్థాపనలే కానీ పనులు ఏవీ జరగలేదని, అప్పటి పనులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే పూర్తి చేసిందని చెప్పారు. గాజువాక వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు), కార్పొరేటర్ గుడివాడ అనూష మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రానికి ఎంతో అవసరమని, ఆయనను తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో 68వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్, నాయకులు వరదాడ వెంకటరమణ, సంద్రాన నూకరాజు, ఈటి సురేష్, నేలపాటి సత్యవతి, వాడపల్లి రామచంద్రరావు, ఆదిబాబు, రాజు, అచ్యుతరావు, ఈటి శ్రీరాములు, ఓ.వెంకట్రావు, ఈటి శంకర్రావు, కోటి, పంచవటి హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, జీవీఎంసీ ఏఈ సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.

చేపట్టనున్న పనులు

- అక్కిరెడ్డిపాలెంలో రూ.69 లక్షలతో కమ్యూనిటీ హాలు నిర్మాణం
- అక్కిరెడ్డిపాలెంలో రూ.19.91 లక్షలతో పలు చోట్ల ఎస్‌డబ్ల్యూ డ్రైనేజీలు, శ్లాబ్ కల్వర్టు నిర్మాణ పనులు
- పంచవటిలో రూ.19 లక్షలతో హాట్ మిక్స్ ప్రాసెస్డ్ రోడ్డు పనులు
- చిన అక్కిరెడ్డిపాలెంలో రూ.10.90 లక్షలతో సీసీ రోడ్లు, సీసీ కాలువల నిర్మాణం
- మింది బస్ స్టాప్ వద్ద రూ.14 లక్షలతో సీసీ రోడ్డు, సీసీ కాలువల నిర్మాణం
- రూ.1 కోటి 32 లక్షలతో అక్కిరెడ్డిపాలెం శ్మశానవాటిక పనులు
- అక్కిరెడ్డిపాలెంలో మరికొన్ని ప్రాంతాల్లో రూ.17 లక్షలతో సీసీ రోడ్లు, సీసీ కాల్వల నిర్మాణం



మిందిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

చంద్రబాబు మాయలో పడితే నాశనమే..

ప్రజలు అసలు చంద్రబాబుకు ఓటు ఎందుకు వేయాలని ఎమ్మెల్యే నాగిరెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రాన్ని నాశనం చేసినందుకు ఓటు వేయాలా, పరిపాలన గాలికొదిలేసి రాష్ట్రాన్ని దోచుకోవడంలో కృషి చేసినందుకు వేయాలా, ఇచ్చిన హామీలు ఒక్కటీ నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసినందుకా, అబద్ధాలు చెప్పి ప్రజలను మభ్యపెడుతున్నందుకా చెప్పాలన్నారు. పొత్తులతో గ్రూపులు కడుతున్న చంద్రబాబు రాష్ట్రాన్ని పరిపాలించడానికా, రాష్ట్రాన్ని దోచుకోవడానికా ఆలోచించాలన్నారు. చంద్రబాబు మాయలో పడితే నాశనమైనట్లేనన్నారు. ఇచ్చిన హామీలతో పాటు ప్రజలకు శ్రేయస్కరమైన మరిన్ని హామీలను జగన్‌మోహన్ రెడ్డి నెరవేర్చారని, ప్రజలంతా ఆయనకు అండగా నిలవాలని కోరారు.

‘ఆరోగ్య సురక్ష’తో మెరుగైన వైద్య సేవలు

గాజువాక: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 70వ వార్డులోని చిట్టినాయుడు కాలనీలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైద్య సిబ్బందిని ఇంటి వద్దకే పంపించి వైద్య సేవలను అందిస్తున్నారన్నారు. ఆరోగ్య సురక్షలో గుర్తించిన వివిధ రకాల జబ్బులకు రిఫరల్ ఆస్పత్రుల ద్వారా ఖరీదైన వైద్యం అందేలా చూస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలతో పాటు వైద్య ఆరోగ్య సేవలు పేదలకు ఉచితంగా అందించడం కోసం జగన్ మోహన్‌రెడ్డికి ముఖ్యమంత్రిగా మరోసారి అవకాశం కల్పించాలన్నారు. వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు మాట్లాడుతూ తమకు వైద్యం అందలేదని రాష్ట్రంలో ఏ కుటుంబమూ బాధపడకుండా చూడటమే లక్ష్యంగా జగనన్న సురక్షను అమల్లోకి తెచ్చారన్నారు. అనంతరం వైద్య సిబ్బంది 315 మందికి వైద్య పరీక్షలను నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ప్రసాదరావు, సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్, స్థానిక నాయకులు పాలఘాట్ కృష్ణ, చందక గోపీ తదితరులు పాల్గొన్నారు.



రోగులకు మందులను అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, సమన్వయకర్త చందు

విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అక్కిరెడ్డిపాలెం: పీఎం విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ) ఏడీ, ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ ఎ.శ్రీను కోరారు. పీఎం విశ్వకర్మ పథకంపై గాజువాకలోని శ్రీ కృష్ణ యాదవ కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చేతి వృత్తి పరికరాల లబ్ధిదారులకు అందించే శిక్షణ, శిక్షణ సమయంలో వర్తించే అవకాశాలు, శిక్షణ అనంతరం చేతి వృత్తుల పనిముట్లు కొనుగోలుకు వర్తించే రుణాలు, స్వయం ఉపాధికి మార్గాలు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో 330 మంది లబ్ధిదారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక కో–ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు, జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారి రమ్య, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, సీఎస్‌సీ హెడ్ జగదీష్, జిల్లా స్కిల్ డెవలప్ మెంట్ ఆఫీసర్ సాయి కృష్ణ, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శివకోటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఎస్‌ఎంఈ ఏడీ శ్రీను

మగ్గం వర్క్‌పై మహిళలకు ఉచిత శిక్షణ

మల్కాపురం: ములగాడ గ్రామంలో గల సామాజిక భవనం వద్ద మగ్గం వర్క్‌పై స్థానిక మహిళలకు ఉచిత శిక్షణ తరగతులు గురువారం ఉదయం ప్రారంభించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా లక్ష్య లెర్నింగ్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో కోరమాండల్ సంస్థ డీజీఎం (హెచ్ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాసరావు మాట్లాడారు. గ్రామంలో సుమారు 32 మంది మహిళలకు మగ్గం వర్క్‌పై నేటి నుంచి ఉచిత శిక్షణ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కోరమాండల్ ఉన్నతాధికారులు కె.శ్రీకాంత్, ఎస్. వెంకటరమణ, ములగాడ గ్రామ పెద్దలు వేణుగోపాల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘ నాయకుల నియామకం

గాజువాక: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ అనుబంధ సంఘాల కమిటీలను నియమిస్తూ పార్టీ కేంద్ర కమిటీ గురువారం ఉత్తర్వులను జారీ చేసింది. ఈ కమిటీల్లో గాజువాక నియోజకవర్గంలోని పలువురు నాయకులను వివిధ బాధ్యతల్లో నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా అద్దేపల్లి రవిబాబు, నేత సంఘం జిల్లా అధ్యక్షుడిగా చిక్కా సత్యనారాయణ, మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా షేక్ మదీనావలి బాషా, కార్యదర్శులుగా సయ్యద్ జుబీ ఉల్లామ్, షేక్ ఎలీమాలను నియమించారు. సంయుక్త కార్యదర్శులుగా షేక్ సాధిక్ అలీష్, పీర్ మహ్మద్, యువజన విభాగం జిల్లా సంయుక్త కార్యదర్శిగా గెద్దాడ నాగరాజు నియమితులయ్యారు.

‘అప్సా’ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వాసుదేవరావు



వాసుదేవరావును సత్కరిస్తున్న సంఘ సభ్యులు

కూర్మన్నపాలెం: అప్సా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కూర్మన్నపాలేనికి చెందిన రామకృష్ణ పబ్లిక్ స్కూల్‌కు చెందిన డాక్టర్ పొన్నాడ వాసుదేవరావు ఎన్నికయ్యారు. ఇటీవల తిరుపతిలో జరిగిన ఏపీ ప్రైవేట్ పాఠశాలల సంఘం (అప్సా) రాష్ట్ర మహాసభల్లో ఆయన్ను ఎన్నుకోవడంతో, ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర ఫైనాన్షియల్ సెక్రటరీగా జిప్సా అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుందరం, చంద్రశేఖర్, రాము, రవీంద్ర, రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, రాజు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సత్కారం



సంపూర్ణంను సత్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: క్రిస్టియన్ సంఘం సేవకుడు దేవుపల్లి సంపూర్ణంను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి గురువారం ఘనంగా సత్కరించారు. సంపూర్ణంకు ఏపీ థియలాజికల్ యూనివర్సిటీ డాక్టరేట్ ఆఫ్ మినిస్ట్రీస్ అవార్డును అందజేసిన సందర్భంగా పెదగంట్యాడలోని వుడా చిల్డ్రన్స్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్టుపూడి పరదేశి, స్టీల్‌ప్లాంట్ వైఎస్సార్ టీయూసీ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప, పలువురు క్రైస్తవ మత పెద్దలు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు



ఉచిత ఆరోగ్య బీమా కార్డులను పంపిణీ చేస్తున్న కరణంరెడ్డి

పెదగంట్యాడ: అర్హులందరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలను అందజేయడమే వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం ఉద్దేశమని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. జీవీఎంసీ 76వ వార్డు నడుపూరు పైడిమాంబ ఆలయం ఎదురుగా వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. జీవీఎంసీ జోన్–6 ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ పథకం కింద రూ.5లక్షల ఉచిత ఆరోగ్య బీమా సదుపాయం అందిస్తున్నారని వివరించారు. లబ్ధిదారులకు బీమా కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్‌బాబు, జీలకర్ర రమణ, సూర్యనారాయణ, సత్యనారాయణ, భువనేశ్వరి, రంజిత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

అక్కిరెడ్డిపాలెం: మహిళలకు కుట్టు మిషన్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విశాఖ జిల్లా భెల్ సమితి అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం సత్యసాయి భజన మండలి సభ్యులు కేశవరావు, బీనా రాణి తెలిపారు. అక్కిరెడ్డిపాలెంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి పాత సాయి శర్వాణి స్కూల్ వద్ద ప్రారంభిస్తున్నట్లు తెలియజేశారు. 40 రోజుల పాటు 80 మందికి (ఉదయం 40, మధ్యాహ్నం 40 మందికి) శిక్షణ ఇస్తామని, శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. కార్పొరేటర్ గుడివాడ అనూష, వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్ మాట్లాడుతూ సత్యసాయి సేవా సమితి చేపడుతున్న కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు వరదాడ వెంకటరమణ, నగర ప్రధాన కార్యదర్శి సంద్రాన నూకరాజు, సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.



ఉచిత శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ గుడివాడ అనూష

ప్రజా భాగస్వామ్యంతో విజయం

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయడానికి కేంద్రప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఐక్య పోరాటాలతోనే ఎదుర్కోగలమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఉద్యమంలో ప్రజలను భాగస్వాములను చేయడం ద్వారా విజయం సొంతమవుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 1099వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సంస్థకు చెందిన హెచ్ఎంఎస్ కాంట్రాక్ట్ కార్మికులు, వివిధ విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీక్షల్లో ఏఐటీయూసీ నాయకులు, పోరాట కమిటీ ప్రతినిధులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

మంచినీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం

88వ వార్డులో పైప్‌లైన్ నిర్మాణానికి శంకుస్థాపన

అగనంపూడి: వెయ్యి కుటుంబాల దాహార్తిని తీర్చేందుకు మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటు పనులు సత్వరం పూర్తి చేయనున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 88వ వార్డు మంగళపాలెం జేఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ బ్లాక్ 34 ప్రాంతంలో మంచినీటి ఎద్దడి నివారణకు రూ.20 లక్షలు, గాంధీనగర్ కాలనీలో నీటి వెతలు తీర్చడానికి రూ.33 లక్షలతో పైప్‌లైన్ అమర్చనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో గాజువాక వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉరుకూటి చందు, మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ గంధ్రెడ్డి కనక మహాలక్ష్మినాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, మండల అధ్యక్షుడు బొద్ద గోవింద్, స్థానిక నాయకులు ఎం.నరసింగరావు, శ్యామ్, చిట్టమ్మ, రాజు, ఎ.బాబూరావు, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.



పైప్‌లైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

ఘనంగా ముగిసిన మెగా స్పోర్ట్స్ కార్నివాల్



ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీ అందుకుంటున్న కేజీహెచ్ ఉద్యోగులు

మహారాణిపేట : ఆంధ్రా మెడికల్ కాలేజీ, కింగ్ జార్జీ ఆస్పత్రులు సంయుక్తగా నిర్వహించిన మెగా స్పోర్ట్స్ కార్నివాల్ గురువారంతో ముగిసింది. ఈనెల 11న మొదలై నేటి వరకు ఏఎంసీ, ఇతర మైదానాల్లో పలు ఈవెంట్లు జరిగాయి. ఉద్యోగుల్లో మానసిక ఒత్తిడి తగ్గించేందుకు, అలాగే ఏఎంసీ వంద సంవత్సరాల వేడుకలను పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహించారు. 60 సంవత్సరాలు పైబడిన వైద్య ఆరోగ్య సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది ఈ క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని మిగతా ఆస్పత్రుల కంటే ఎక్కువ బహుమతులు గెలిచి ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. వివిధ క్రీడల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు పతకాలు, సర్టిఫికెట్లు, జ్ఞాపికలను సూపరింటెంటెంట్ డాక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు అందించారు. ఈ ముగింపు పోటీల్లో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, డీసీఎస్ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మీ తులసీ, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ ఈఈ నాయుడు, డీఈఈ మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో కార్మికుల సమ్మె నేడు

సన్నద్ధమవుతున్న సంఘాలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో కార్మికులు శుక్రవారం సమ్మె చేయనున్నారు. ఇందుకోసం కార్మిక సంఘాలు సన్నద్ధం అవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా స్టీల్‌ప్లాంట్‌లో నిరసన తెలియజేయనున్నారు. పలు డిమాండ్ల సాధన కోసం దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు, వివిధ కర్షక సంఘాలు 16న గ్రామీణ భారత్ బంద్ పేరిట పిలుపునిచ్చాయి. ఇందులో భాగంగా జాతీయ కార్మిక సంఘాలు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించరాదని, కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయాలని, అందరికీ ఇళ్లు ఇవ్వాలని, ఆహార ధరలు తగ్గించాలనే తదితర డిమాండ్లపై సమ్మెలో పాల్గొంటున్నారు. సమ్మె నేపథ్యంలో కార్మిక సంఘాలు పలు విభాగాలు, బస్టాపులు, సెంట్రల్ స్టోర్స్ కూడళ్ల వద్ద సభలు, సమావేశాలు నిర్వహించాయి. గురువారం సాయంత్రం కోక్‌ఓవెన్స్ విభాగం నుంచి మెయిన్ గేటు వరకు ర్యాలీ నిర్వహించారు.

కార్మిక సంఘాలకు అధికారుల వినతి

సమ్మె అంశంపై రీజనల్ లేబర్ కమిషనర్ (ఆర్ ఎల్ సి), ఉక్కు ఉన్నతాధికారులు కార్మిక సంఘాలతో సమావేశమయ్యారు. సమ్మె చేయటం వల్ల జరిగే అనర్థాలను వివరించి సమ్మెను ఉపసంహరించుకోవాల ని కోరారు. అయితే, తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె తప్పదని కార్మిక సంఘాలు స్పష్టం చేశాయి.

కాంట్రాక్టు కార్మిక సంఘాల మద్దతు

సమ్మెకు స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు తమ మద్దతు తెలియజేశాయి. కాంట్రాక్ట్ కార్మిక సంఘాల పిలుపు మేరకు కాంట్రాక్ట్ కార్మికులు కూడా విధులు బహిష్కరించి నిరసన తెలపనున్నారని ఆయా సంఘాల నాయకులు తెలిపారు.

యాజమాన్యం ముందస్తు చర్యలు:

సమ్మె నేపథ్యంలో ఉక్కు యాజమాన్యం ముందస్తు చర్యలు చేపట్టింది. విధులకు హాజరు కాని వారికి నో వర్క్ – నో పే అంటూ ప్రకటించింది. అధికారులను ప్రధాన విభాగాల్లో 12 గంటల డ్యూటీలకు సిద్ధం చేశారు. క్యాంటీన్లు, రవాణా సౌకర్యాలకు అంతరాయం కలిగే అవకాశం ఉన్నందున సొంత ఏర్పాట్లు చేసుకోవాలని ఉద్యోగులకు విజ్ఞప్తి చేసింది.

పోలీసులు అప్రమత్తం

సమ్మె సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ అన్ని చర్యలు తీసుకుంటోందని స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు తెలిపారు. సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ ఆధ్వర్యంలో అన్ని గేట్లు, ప్రధాన కూడళ్ల వద్ద పికెట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందుకోసం తమ సిబ్బందితో పాటు హోంగార్డులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది సహకారం తీసుకుంటున్నామని తెలిపారు.

భెల్ కార్మికుల నిరసన

అక్కిరెడ్డిపాలెం: దేశవ్యాప్త సమ్మెలో భాగంగా 16న చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ భెల్ (హెచ్‌పీవీపీ)లో రెండో రోజు సంస్థ అఖిలపక్ష కార్మిక సంఘాలు నిరసన తెలిపాయి. కార్యక్రమంలో ఏఐసీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంయూఎస్ఆర్ పట్నాయక్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం తీసుకున్న కార్మిక చట్ట వ్యతిరేక విధానాలను కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా తిప్పికొట్టాలన్నారు. గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి సుభాకర్ సాహు, ఇంటక్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు, సిటూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్, ప్రతినిధులు సీతంనాయుడు, పీవీఎస్ రాజు, ఎస్.జగన్నాధరావు తదితరులు పాల్గొన్నారు.



కోక్‌ఓవెన్స్ నుంచి మెయిన్ గేటు వరకు ర్యాలీ చేస్తున్న కార్మిక సంఘాలు



స్టీల్‌ప్లాంట్ సెంట్రల్ స్టోర్స్ వద్ద ప్రచారం చేస్తున్న కార్మిక నాయకులు



భెల్ వద్ద మాట్లాడుతున్న ఏఐసీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పట్నాయక్

వైభవంగా గణపతి కల్యాణం

పెదగంట్యాడ: గణపతిని ఆరాధిస్తే సకల శుభాలు చేకూరతాయని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 76వ వార్డు నడుపూరులోని సంకటమోచన గణపతి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ అధ్యక్షుడు మంత్రి నరిసింహమూర్తి ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యం, నీరాజన మంత్రపుష్పం, అభిషేకాలు చేశారు. అనంతరం మంగళ వాయిద్యాలు, మేళ తాళాల నడుమ సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి కల్యాణం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, మంత్రి రాజశేఖర్, ఉరుకూటి అప్పారావు, కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, మంత్రి శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సిద్ధి, బుద్ధి సమేత గణపతి

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

- వేడుకగా స్వర్ణపుష్పార్చన
- ఘనంగా నిత్యకల్యాణం

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చనను విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై ఆశీనులను చేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. 108 స్వర్ణసంపెగలతో అష్టోత్తర శతనామావళిపూజ నిర్వహించారు.ఉభయదాతలకు స్వామి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.



స్వర్ణపుష్పాలతో అప్పన్న ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి

నేత్రపర్వంగా నిత్యకల్యాణం..

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఉభయ దాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.